భూగర్భ జలాల పెంపునకు సేద్యపు నీటి కుంటలు

- రైతులకు ఎంతో ప్రయోజనం
- ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం


అందుకూరు గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న సేద్యపు నీటి కుంట

క్రోసూరు: పొలాలకు నీళ్లు పుష్కలంగా అందించి పంటలు దిగుబడి బాగా పొందేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సేద్యపు నీటి కుంటల నిర్మాణాలకు చేయూత నిస్తుంది. మండలంలో ఈ ఏడాది సేద్యపు నీటి కుంటల నిర్మాణాలే లక్ష్యంగా పనిచేయాలంటూ డ్వామా పీడీ సిద్ధమూర్తి ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నప్పటికీ రైతులు పూర్తి స్థాయిలో ముందడుగు వేయటం లేదని చెప్పాలి.

● వర్షాలు పడినపుడు పొలంలో నీరు పారే దిశగా సుమారు 10 సెంట్ల స్థలంలో సేద్యపు నీటి కుంట ఏర్పాటు చేసుకునేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీల చేత నిర్మాణం చేసి అందిస్తుంది. అందుకు కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా వేతనాలు చెల్లించటం జరుగుతుంది. కేవలం రైతు అంగీకారం తెలిపి తనకు కావాలిసిన సైజు సూచిస్తే ప్రభుత్వమే సేద్యపు నీటి కుంట తయారు చేసి ఇస్తుంది.

కొలతలు.. ఖర్చు ఇలా...

రైతు సేద్యపు నీటి కుంట ఏర్పాటుకు 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు, లోతు 2 మీటర్లలో నిర్మాణం చేసుకుంటే రూ.30,281 కూలీల వేతనాలకు ఖర్చు చేస్తుంది. అదే విధంగా 10, 10, 2 కొలతలకు రూ.70,521, కొలతలు 15, 15, 2 ప్రకారం రూ.1,32,190, 20, 20, 2 ప్రకారమైతే రూ.2,14,358 ఖర్చు చేస్తుంది.

150కి గాను 30 మాత్రమే పూర్తి

మండలంలో ఈ ఏడాది మొత్తం లక్ష్యం 150 సేద్యపు నీటి కుంటలకు గాను ఇప్పటికి 30 మాత్రమే పూర్తి చేసినట్లు ఏపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. మరో 57 వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. సేద్యపు నీటి కుంటలు నిర్మించుకోవటం వలన భూగర్భ జలాలు పెరగటమేకాక, పొలాల గట్లపై మొక్కలు, పొలాల్లో పశువులకు మేత, పండ్ల మొక్కలు, పెంచుకోవచ్చని, అదే విధంగా గట్లపై కూరగాయలు కూడా పెంచుకోవచ్చునని ఏపీవో తెలియజేశారు.

నీటి కుంటలు నిర్మించుకోవాలి



ప్రతి రైతు తమ పొలాల్లో సేద్యపు నీటి కుంటలు నిర్మించుకోవాలి. తద్వారా రైతుకు అన్ని విధాలుగా సేద్యపు నీటి కుంటలు ఉపయోగపడతాయి. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రైతుకు కాలసిన విధంగా ప్రభుత్వం నిర్మాణాలు చేసి ఇస్తుంది.
– జి.రవికుమార్, ఎంపీడీవో

కదలి రండి.. విజయవంతం చేద్దాం

వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో పాటు ప్రజలను చంద్రబాబు అన్ని రకాలుగా మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసాన్ని ప్రజలకు వివరించేందుకు వెన్నుపోటు దినాన్ని ప్రజల భాగస్వామ్యంతో భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీన్ని అంతా కలిసి విజయవంతం చేద్దామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలో పరిపాలనపై దృష్టి సారించకుండా సహజ వనరుల దోపిడీ, అక్రమ కేసుల బనాయింపు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం తప్ప చేసింది శూన్యమన్నారు.

నేటి వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

వైఎస్సార్‌సీపీ మండల నాయకులు


విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

దొడ్లేరు(క్రోసూరు): వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం చేపడుతున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పిలుపునిచ్చారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో పార్టీ నాయకుల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి అప్పిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అన్ని విధాలుగా ప్రజలను మోసం చేసిందన్నారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకపోగా ప్రజలపై పెనుభారాలు మోపిందన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గుర్తించారని అన్నారు. ప్రజల నిరసన గళాన్ని ప్రభుత్వానికి తెలియజేసేందుకు వెన్నుపోటు దినం కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీగా బయలు దేరి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయటం జరుగుతుందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్‌రహీం, సయ్యద్ సైదా, ఖాజా, మీరా, మాజీ యార్డు వైస్ చైర్మన్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం జయప్రదం చేయండి: ఎంపీపీ

పెదకూరపాడు : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం క్రోసూరు నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటలకు నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరి వినతపత్రాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వెన్నుపోటు రాజకీయాలను చేస్తుందని ధ్వజమెత్తారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కిశోర బాలికలు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

సీడీపీవో సరళ


పెదకూరపాడులో కిశోర బాలికలకు యోగాపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది


మాదల అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జయలక్ష్మి

పెదకూరపాడు: కిశోర బాలికలు చిన్నతనం నుంచి నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలని 75 త్యాళ్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సరళ అన్నారు. పెదకూరపాడులోని ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసంలో భాగంగా కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూ బాలికలు సాధికారత దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షేక్ మున్ని, మహిళా పోలీసులు స్రవంతి శ్రీలక్ష్మీ, తిరుమల విమల, సిబ్బంది రాజ్యలక్ష్మి, జి.కుమారి, సీహెచ్ సామ్రాజ్యం, బి.వి.సామ్రాజ్యం, వెంకటలక్ష్మి, స్రవంతి, కరిమున్, గౌసియా పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు అంగన్‌వాడీ కేంద్రం–1లో కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ అనంతలక్ష్మి కౌమార దశలో రక్త హీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలల హక్కులు, పోక్సో చట్టంపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. కౌమార బాలికల నాయకత్వం, సాధికారత గురించి వివరించారు. బాల్య వివాహాలు వద్దంటూ ప్రతిజ్ఞ, యోగా కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త రోజ్ మేరి, చాముండేశ్వరి, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి జయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే మండలంలోని మాదల అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి పాల్గొని కిశోర బాలికల నాయకత్వం, సాధికారత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవులు కబేళాకు తరలిస్తే చర్యలు

ఏఎంసీ కార్యదర్శి ఈశ్వరరావు

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని క్రోసూరు మార్కెట్‌యార్డులో ప్రతి మంగళవారం గురువారం నిర్వహించే సంతలో కబేళాకు తరలించే గోవుల క్రయవిక్రయాలు నిషేధమని రైతులు తెలుసుకోవాలని యార్డు కార్యదర్శి ఈశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ సంతలో కేవలం గేదెలు, కోడెదూడలు, ఎద్దులు, ఆవులు రైతుల వ్యవసాయం నిమిత్తం, పాడి కోసం మాత్రమే క్రయవిక్రయాలు జరుగుతాయన్నారు. కావున రైతులు ఎవరైనా కబేళాకు తరలించే ఆవులను యార్డులో క్రయవిక్రయాలు జరిపితే అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్కెట్‌యార్డు ఆవరణలో దీనిపై ఫ్లెక్సీలు, గోడలపై పెయింట్ ద్వారా, మైకు ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా కబేళాకు తరలించేందుకు సంతలో, సంత బయట ఆవుల విక్రయాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలతోపాటు జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

శావల్యాపురం: క్షయ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్తా భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధి కారి రమ్య మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు జ్వరం ఆకలి మందగించటం తదితర లక్షణాలతో బాధపడే వారందరూ సత్వరమే వైద్యులను సంప్రదించి సకాలంలో వైద్యసేవలు అందించటం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పుతుందన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమలను నివారిద్దాం.. మలేరియాను అరికడదాం


అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశావర్కర్స్, పంచాయతీ సిబ్బంది


గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

అచ్చంపేట: మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలను నివారించుకోవాలని అచ్చంపేట సర్పంచ్ షేక్ జానీ తెలిపారు. మలేరియా నివారణ మసోత్సవాలలో భాగంగా ఆశావర్కర్స్ ఆధ్వర్యంలో అచ్చంపేటలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాని మాట్లాడుతూ మలేరియా సాధారణంగా దోమకాటు వలన వ్యాప్తి చెందుతుందన్నారు. దోమలను నివారించేందుకు పంచాయతీల ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇళ్ల ముందు మురుగు శుభ్రపరచుకోవడం, మురుగు కాలువల్లో తరచూ బ్లీచింగ్ చల్లుకోవడం, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరాల రమేష్, అనుముల సాంబిరెడ్డి, ఆశా వర్కర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రాజుపాలెం: వర్షాలు పడుతున్న సందర్భంగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పల్నాడు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి చెప్పారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవ అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతాంజలి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలుంటే తొలగించాలన్నారు. మురికి నీటి నిల్వపై ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తే మలేరియా రాకుండా చేయవచ్చని తెలిపారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పాల్‌రవి, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఆశ నోడల్ అధికారి సురేష్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తనాలు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు

సత్తెనపల్లి ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీధర్‌రెడ్డి


విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి


క్రోసూరులో విత్తన షాపును తనిఖీ చేస్తున్న ఏవో వేణుగోపాల్


ముప్పాళ్ళలోని గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏవో అరుణ


గణపవరంలో విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో వెంకట నరసయ్య

సత్తెనపల్లి: విత్తనాలు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సత్తెనపల్లి ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాలు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో మంగళవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ విత్తన దుకాణదారులు తప్పకుండా విత్తన ధరల పట్టిక, రోజువారి విత్తన నిల్వల వివరాలు షాపులో ప్రదర్శించాలన్నారు. రైతులకు కావలసిన విత్తనాలు కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం చేయకూడదని సూచించారు. డీలర్లు రైతులకు తప్పకుండా విత్తన అమ్మకాల బిల్లులు ఇవ్వాలన్నారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. అలాగే డీలర్లు అధీకృత కంపెనీ నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. డీలర్లు రైతులకు అధిక ధరలకు, అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు తనిఖీ చేసి షాపు లేదా డీలర్ పేరు మీద బిల్లు లేకుండా ఎటువంటి విత్తనాల నిల్వలు వచ్చినా వ్యవసాయ అధికారి కార్యాలయానికి తెలియజేయాలన్నారు.

విత్తన షాపులు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీ

క్రోసూరు: మండలంలోని పలు విత్తన దుకాణాలు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలను మంగళవారం ఏడీఏ హనుమంతరావు, ఏవో వేణుగోపాల్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా వారు డీలర్లకు, ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులకు పలు సూచనలు చేసారు. డీలర్లు విత్తనాలకు సంబంధించి ప్రిన్స్‌పల్ సర్టిఫికెట్లను విధిగా కలిగి ఉండాలని, అలా లేని ఎడల విత్తన అమ్మకాలను నిలుపుదల చేసి డీలర్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు షాపులో విత్తన రకాలు, నిల్వ, ధరలను సూచించే బోర్డును ప్రదర్శించి, ప్రతి రోజు స్టాకు వివరాలను నమోదు చేయాలన్నారు. కొనుగోలు చేసిన విత్తన వివరాలతో బిల్లును రైతులకు ఇవ్వాలన్నారు. అమ్మకాలు, కొనుగోళ్లను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. డీలర్లు రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే సరఫరా చేయాలని, అలాగే అధిక ధరకు అమ్మటం, కృత్రిమ కొరత సృష్టించడం చేయకూడదన్నారు. ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది వ్యవసాయ శాఖ వారికి సహకరించాలని కోరారు.

విత్తనాలను సదరు విత్తన కంపెనీ సర్టిఫికెట్, కొనుగోలు బిల్లును పరిశీలించి రవాణా చేయాలన్నారు. విత్తనాల బుకింగ్, డెలివరీకి వచ్చిన వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినచో మండల వ్యవసాయాధికారి, ఫోన్ నెంబర్ : 8331056937కు తెలియచేయాలన్నారు. రైతులు అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.

ధరల పట్టిక ఏర్పాటు చేయాలి

ముప్పాళ్ళ: రైతులకు ధరలు కనిపించేలా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, ప్రతి రోజు స్టాక్ వివరాలు నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని గ్రోమోర్ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. విత్తనాలు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మాలని సూచించారు. అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. గ్రోమోర్ కేంద్రం మేనేజర్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

ఏడీఏ హనుమంతరావు

అచ్చంపేట: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకు వి.హనుమంతరావు డీలర్లను హెచ్చరించారు. మండలంలోని వేల్పూరులో మంగళవారం ఆయన విత్తన షాపులను తనిఖీ చేశారు. లూజు విత్తనాలు విక్రయించరాదని, ప్రభుత్వ అనుమతులు పొందిన విత్తనాలనే విక్రయించాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయించరాదన్నారు. విత్తనాలు విక్రయించిన వెంటనే రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. ప్రతి విత్తన దుకాణంలో కచ్చితంగా స్టాక్ బోర్డు ఉంచి, స్టాకు, ధరలు అందులో పొందుపరచాలని సూచించారు. ఎక్కువ ధరలకు విక్రయించినట్లు రైతులు తమ దృష్టికి తీసుకువస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. ఆయన వెంట ఏవో వెంకటేశ్వర్లు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

రాజుపాలెం: నాణ్యమైన విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి పి.వెంకటనరసయ్య డీలర్లను హెచ్చరించారు. మండలంలోని గణపవరంలో విత్తనాల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు ఉన్న కంపెనీలు, డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. స్టాక్ బోర్డు, రిజిస్టర్‌ను ప్రతి రోజు అప్‌డేట్ చేయాలన్నారు. విత్తనాలు కొన్న ప్రతి రైతుకు రశీదు ఇవ్వాలన్నారు. విత్తన చట్టానికి లోబడి మాత్రమే దుకాణాలు నిర్వహించాలని సూచించారు. రైతులు కూడా తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు.

మరి మాకు తప్పదుగా...

- రేషన్ షాపుల నుంచి రేషన్ మోసుకెళ్తున్న మహిళలు
- ఇదేనా మంచి ప్రభుత్వం అని ప్రశ్నిస్తున్న రేషన్ లబ్ధిదారులు


రేషన్ షాపు నుంచి రేషన్ బియ్యాన్ని మోసుకెళ్తున్న మహిళలు

పెదకూరపాడు : ఇంటి వద్దకే వచ్చి రేషన్ ఇచ్చేవారయ్యా.. మరి ఇప్పుడు ఏందో రేషన్ షాప్ వద్దకు వెళ్లి తీసుకోమన్నారు. ఇంటిలోని మగవారు షాపుల వద్దకు వెళ్లి క్యూ లైన్‌లో నిలబడి రేషన్ సరుకులు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు.. మరి మాకు తప్పదుగా.. అందుకే ఎండలోనైనా క్యూలో నిలబడి ఇలా రేషన్ మోసుకుని వచ్చే పరిస్థితి ఏర్పడింది.. ఇదేం మంచి ప్రభుత్వం అంటూ రేషన్ కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు ఇచ్చేవారు. మేము పొలం పనులకు వెళ్లినా ఇంట్లో ఉన్న మగవారు, ముసలివారు, పిల్లలు రేషన్ తీసుకునేవారు ఇప్పుడు ఇదేం కర్మ అంటూ ప్రశ్నిస్తున్నారు. పెదకూరపాడులో ఉదయం 11 గంటల సమయంలో రేషన్ దుకాణాల నుంచి ఇలా రేషన్ తీసుకువెళ్తూ అవస్థలు పడుతూ కనిపించిన దృశ్యాలు.

ఘనంగా గంగమ్మ తల్లి జాతర



శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో వేంచేసియున్న గంగమ్మ తల్లి జాతర వేడుకలు గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అందరు గంగమ్మ తల్లిని దర్శించుకొని జలాభిషేకం చేసి పసుపు–కుంకుమలతో మేళాతాళాల నడుమ వైభవంగా బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవం కార్యక్రమంలో పార్టీలు కులమతాలకు అతీతంగా భక్తులందరూ అమ్మవారిని దర్శించుకున్నారు. భారీ అన్నసంతర్పణ నిర్వహించారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



పెదకూరపాడు: పెదకూరపాడు విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం డొక్కా సీతమ్మ– మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం మండల విద్యా శాఖాధికారి తాడిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాస్టర్ ట్రైనీ రమాదేవి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన ఆరోగ్యం కోసం–బలవర్ధకమైన ఆహారం విద్యార్థులకు అందించనుందని తెలిపారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు శుభ్రంగా, వేడిగా విద్యార్థులకు భోజనం అందించాలని అన్నారు. వంటశాల శుభ్రంగా ఉండాలని, గుడ్లు మంచివి వాడాలని కోరారు. మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ నిబంధనల మేరకు విద్యార్థులకు భోజనం అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సీహెచ్‌వో అనుపమ మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మార్సీ సిబ్బంది, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు, ఏజెన్సీలు, ఆయాలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



క్రోసూరు: మండలంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పలు రకాల పోటీలు, అభ్యసనాలు నిర్వహించారు. మంగళవారం విద్యార్థులకు స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎం.అంజనీ హేమలత, ఎం.నందిని, డి.రూప ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు విజ్ఞాన శిబిరాలు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

గో మాతను రక్షించండి

అమరావతి: మండల పరిధిలో కొంతకాలంగా గోవులను అక్రమంగా తరలించి గో వధ జరుగుతున్నదని, దీనిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మండల విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం తహసీల్దార్ దానియేల్, ఎస్ఐ రాజశేఖర్‌కు వినతిపత్రాలు అందించి, అనంతరం ఆయన మాట్లాడుతూ అమరావతి మండల పరిధిలోని గ్రామాలలో గో హింస జరుగుతున్నట్లు తమ సభ్యుల దృష్టికి వచ్చిందన్నారు. అనాది నుంచి భారత దేశంలో గోవులను పవిత్రంగా ముక్కోటి దేవతలు కొలువై యున్న గో మాతగా హిందువులు పూజిస్తారన్నారు. జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణలో గోవుల పాత్ర అత్యంత కీలకమైనదని, అట్టి గో మాతలను పరిరక్షించాలని, గో వధను అరికట్టే బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. గోవుల అక్రమ తరలింపు, గో వధపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హిందువుల మనోభావాలను దెబ్బ తీసే ఇటువంటి చర్యలపై విశ్వహిందూ పరిషత్ నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో మల్లాల విశ్వనాథం, పసుపులేటి రామనాథ్, గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అన్నవరపు రమేష్, ఆనంద్, మల్లాల భార్గవ తేజ, గోపి, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ కార్డు లేదని డిశ్చార్జ్

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో వృద్ధ దంపతుల ఆవేదన



సత్తెనపల్లి: ఆరోగ్యశ్రీ కార్డు లేదని నయం కాకుండానే వైద్యశాల నుంచి డిశ్చార్జ్ కావాలంటున్నారని వృద్ధ దంపతులు ఆవేదన వెలిబుచ్చారు. రాజుపాలెం మండలం అంచులవారిపాలెం గ్రామానికి చెందిన పోతంశెట్టి నాగయ్య, మంగమ్మ దంపతులు గత మూడు రోజుల క్రితం కుమారుడు దాడి చేయడంతో గాయాలతో సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేరారు. మంగమ్మ తలకు గాయం కావడంతో వైద్యశాలలోనే కుట్లు వేశారు. నొప్పులతో బాధపడుతున్నప్పటికీ ఆమె వద్దకు మంగళవారం వైద్యశాలలో పని చేసే నర్సు వచ్చి ఆరోగ్యశ్రీ కార్డు అడిగింది. తమ దగ్గర లేదని చెప్పడంతో ఆరోగ్యశ్రీ కార్డు లేకపోతే డిశ్చార్జి కావాల్సిందేనని హుకుం జారీ చేసింది. దీంతో ఏం చేయాలో తెలియని వృద్ధ దంపతులు సత్తెనపల్లిలో ఉంటున్న అల్లుడు అప్పయ్యకు సమాచారం అందించగా ఆయన వచ్చి ఆరోగ్యశ్రీ కార్డు ఎందుకు అని నర్సును ప్రశ్నించాడు. ఆరోగ్య శ్రీ కార్డు తప్పనిసరని, నొప్పులకు మాత్రలు ఇస్తామని, 11వ రోజు వస్తే కుట్లు తీస్తామని చెప్పింది. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావును సంప్రదించగా ఎక్కడో ఏదో పొరపాటు జరిగి ఉంటుందని, ఆరోగ్యశ్రీ కార్డు అడిగిన నర్సును పిలిచి మందలించారు. ఇదే కాదని చేతికి ఏర్పాటు చేసిన క్యాన్‌లా గార్డులు తీస్తున్నారని, వైద్యశాలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిని విచారించి చర్యలు తీసుకోవాలని అప్పయ్య కోరాడు.

పచ్చిరొట్ట విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

ఏడీఏ రవిబాబు

శావల్యాపురం: పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో రైతులకు రాయితీపై ప్రభుత్వం మంజూరు చేసిన పచ్చరొట్ట విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ మండలంలోని 11 రైతుసేవా కేంద్రాల్లో 65 క్వింటాళ్ల జనుము విత్తనాలు ఉన్నాయని బహిరంగ మార్కెట్‌లో పది కేజీల సంచి రూ.1090 రూపాయలు ఉండగా రాయితీ మినహాయించి రూ.545 రూపాయలు రైతులు చెల్లించాల న్నారు. అలాగే త్వరలో జీలుగులు, పిల్లిపెసర విత్తనాలు వస్తాయన్నారు. పచ్చిరొట్ట విత్తనా లు సాగు చేయడం వలన పంట పొలాల్లో అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా ఉంటాయ ని, తద్వారా సాగుచేసిన పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయన్నారు. అలాగే మండలంలోని 15 గ్రామ పంచాయతీలో 1942 మంది కౌలు రైతులకు కౌలు రైతు కార్డులు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. ఏవో రామినేని రామారావు, ఏఈవో పురేటి అశోక, రైతులు పాల్గొన్నారు.